క్లుప్తంగా

16న శాకంబరి అలంకరణ

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో ఈ నెల 16వ తేదీన శాకంబరి అలంకరణ జరుగుతుందని ఈఓ డి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఏటా ఆషాఢ మాసంలో కుమార రామ భీమేశ్వరస్వామితో పాటు ఆలయమంతా కూరగాయలు, పండ్లతో అలంకరిస్తామని చెప్పారు. కూరగాయలు, పండ్లు ఇచ్చే దాతలు ముందుగానే తమ పేర్లను నమోదు చేయించుకోవాలని కోరారు.

నేడు సమీక్ష సమావేశం

సామర్లకోట: మండల పరిధిలోని గ్రామాల్లో నిర్మిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల భవనాల పురోగతిపై బుధవారం ఉదయం సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.శ్రీలలిత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్ని సమీక్ష చేస్తారని తెలిపారు.

చైల్డ్‌లైన్‌కు అనాథల అప్పగింత



అనాథలను చైల్డ్‌లైన్ అధికారులకు అప్పగించిన ఎస్‌ఐ లోవరాజు

సామర్లకోట: స్థానిక రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పిల్లలతో భిక్షాటన చేస్తున్నవారిని జీఆర్పీ ఎస్‌ఐ బి.లోవరాజు గమనించి వారిని చైల్డ్ వెల్ఫేర్ లైన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్లాట్‌ఫాంపై తనిఖీ చేస్తుండగా ముగ్గురు పిల్లలతో భిక్షాటన చేస్తున్న మహిళను గుర్తించామన్నారు. భర్త వదిలేయడంతో దిక్కుతోచని స్థితిలో భిక్షాటన చేసుకుని జీవిస్తున్నట్లు చెప్పడంతో చైల్డ్‌లైన్‌కు ఫోన్ చేసి వారిని అప్పగించామన్నారు.

ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ అమ్మవారు



పెద్దాపురం మరిడమ్మ అమ్మవారు

పెద్దాపురం: జాతర ఉత్సవాల్లో భాగంగా పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని మంగళవారం ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఈఓ సీహెచ్ రామ్మోహన రావుల ఆధ్వర్యంలో వేద పండితులు అమ్మవారికి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



కల్వర్టు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న సాయి ప్రసాద్

పెద్దాపురం: రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టుల నిర్మాణంలో నాణ్యత పాటించాలని మున్సిపల్ అధికారులను పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆదేశించారు. స్థానికంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఆయన వెంట కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, కో–ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ తదితరులున్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన

కాకినాడ రూరల్: మండలంలోని ఇంద్రపాలెంలో నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీఓ ఎస్‌వీవీ సత్యనారాయణ మంగళవారం ఓటర్ల జాబితాను పరిశీలించారు. ఆ పంచాయతీ పరిధిలోని శ్రీనివాసనగర్‌లో 138 స్టేషన్ పరిధిలో 1–47 డోర్ నెంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు నమోదైన నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సంబంధిత ఓటర్లకు నోటీసులు జారీ చేసి దోష రహిత ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వి.మురార్జీ, గ్రామ రెవెన్యూ అధికారులు, బూత్ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన అంగన్‌వాడీ నిరసన

కాకినాడ సిటీ: కలెక్టరేట్ వద్ద హామీలు అమలు చేయాలని కోరతూ అంగన్‌వాడీలు తలపెట్టిన 36 గంటల నిరసన మంగళవారం ముగిసింది. యూనియన్ నాయకులు జి.బేబీరాణి, చంద్రావతి, చెక్కల రాజ్‌కుమార్, దువ్వా శేషుబాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లు కాదు.. వారియర్లు

- ముంగిటకే ప్రభుత్వ పథకాల అందజేత
- లబ్ధిదారుల మదిలో నిలచిన వలంటీర్లు

సామర్లకోట: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందించేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. సేవే పరమావధిగా భావిస్తున్న వలంటీర్లు నామమాత్రపు గౌరవ వేతనంతో విధులు నిర్వర్తిస్తూ వెలకట్టలేని సేవలను ప్రజలకు అందిస్తున్నారు. అటువంటి వలంటీర్ వ్యవస్థను కించ పరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లే కాదు సామాన్య ప్రజలు కూడా భగ్గుమంటున్నారు. కరోనా సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి అందించిన సేవలకు వెలకట్టలేమంటున్నారు. దేశానికే ఆదర్శంగా ఉన్న వలంటీరు వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలన్న దురుద్దేశంతో కొంతమంది కంకణం కట్టుకున్నారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంక్షేమ వారధులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలపై సామాన్య ప్రజానీకం వెల్లడిస్తున్న అభిప్రాయాలివి..

ఇంటి స్థలం పొందా



సామర్లకోట: సొంతిల్లు లేని నా పరిస్థితిని గమనించి వలంటీరు ఇంటి స్థలానికి దరఖాస్తు తీసుకున్నారు. ఇంటి స్థలం వచ్చింది. వలంటీరు ప్రోత్సాహంతోనే బ్యాంకు నుంచి రుణం తీసుకొని ఇల్లు కట్టుకున్నాను. దాంతో నాకు సొంతింటి కల నెరవేరింది. దీనంతటికీ కారణం వలంటీర్లే.. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీరు వ్యవస్థ పేదలకు మేలు చేస్తుంది.

– కె.విజయకుమారి, జగనన్న ఇంటి లబ్ధిదారు, సామర్లకోట

అమ్మ ఒడి పథకంపై అవగాహన పెంచారు



పిల్లలను బడికి పంపితే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.15 వేలు బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని వలంటీర్లు చెబితే నేను నమ్మలేదు. వలంటీరు దరఖాస్తు తీసుకొచ్చి సంతకం చేయించుకుని వెళ్లారు. గత నాలుగేళ్లుగా అమ్మ ఒడి పథకం అందుకుంటున్నాను.

– శీల సంపూర్ణ, అమ్మ ఒడి లబ్ధిదారు, సామర్లకోట

వితంతు పింఛను ఇస్తున్నారు



కుటుంబానికి ఆధారమైన నా భర్త చనిపోయాడు. ఇద్దరు బిడ్డలను ఎలా పోషించుకోవాలో అర్థం కాలేదు. వలంటీర్ ఇంటికొచ్చి మరణ ధ్రువీకరణ పత్రం అందజేసి వితంతు పింఛనుకు దరఖాస్తు చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్ వచ్చి పింఛను ఇస్తున్నారు. దాంతో నా కుటుంబానికి భరోసా ఏర్పడింది.

– పి.ఆదిలక్ష్మి, వితంతు పింఛను లబ్ధిదారు, సామర్లకోట

దిగజారుడుతనం



నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై పవన్ కల్యాణ్ దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదు. గత ప్రభుత్వంలో లాగ ఏ ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరగవలసిన అవసరం లేకుండా నా పిల్లలకు అవసరమైన అమ్మ ఒడి, కుటుంబ పోషణకు అవసరమైన వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత పథకాలను మాకు అందేలా మా వలంటీర్ నాగలక్ష్మీదేవి ఎంతో సేవ చేశారు. ఆమె ద్వారా మేము పొందిన ప్రభుత్వ లబ్ధిని ఎన్నటికీ మరువలేము. నిరాధార ఆరోపణలు చేస్తూ వలంటీర్ వ్యవస్థపై నోరు పారేసుకోవడం దుర్మార్గం.

– మొరుకుర్తి వరలక్ష్మి, కొమరగిరి

వలంటీర్ల సేవలు మరువలేం



వలంటీర్లు ఒంటరి మహిళల సమాచారం సేకరించి సంఘ విద్రోహ శక్తులకు ఇస్తున్నారన్న అబద్ధపు ఆరోపణలు చేయడం పదవ్‌కు తగదు. కేవలం రూ.5వేల గౌరవ వేతనంతో మా ఇంటిల్లిపాదికీ అవసరమైన, అర్హమైన పథకాలను నిర్ణీత కాల వ్యవధిలో అందజేస్తున్న వలంటీర్ల సేవలు గర్వించదగినవి. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారకుండానే వచ్చి పింఛను ఇచ్చి ఆదుకుంటున్నారు. కరోనా సమయంలో దగ్గరి బంధువులు సైతం రావడానికి భయపడే రోజుల్లో వారు వచ్చి అవసరమైన వైద్య సేవలు అందించేవారు. మా కుటుంబంలో ఏ అవసరం వచ్చినా వలంటీర్ నాగలక్ష్మీదేవి అందుబాటులో ఉంటూ సేవ ఎన్నో సేవలందిస్తున్న వలంటీర్ సేవలు ఎన్నటికీ మరువలేము.

– మొరుకుర్తి సింగమ్మ, కొమరగిరి

ప్రతి ఇంటా సంతోషం

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- కొత్త మూలపేటలో గడప గడపకూ



కొత్త మూలపేటలో లబ్ధిదారులకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'సంక్షేమ' పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని కొత్తమూలపేటలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా లబ్ధిదారులు పొందిన పొందిన పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గతంలో చంద్రబాబు హయాంలో పథకాలు పేరుచెప్పి ఆయన, ఆ పార్టీ నాయకులు ప్రజా ధనాన్ని దోచుకునే వారని విమర్శించారు. బాబు వస్తే జాబు వస్తుందని మభ్యపెట్టి 2014 ఎన్నికల్లో గెలిచారని తీరా గెలిచాకా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఆయన కుమారుడు లోకేష్‌కు మాత్రం ఎన్నికల్లో గెలవకపోయినా మంత్రిపదవి ఉద్యోగం ఇచ్చారని ఎద్దేవా చేసారు. జగనన్న ప్రభుత్వం ఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన హామీని 98శాతం నెరవేర్చిందన్నారు. సర్పంచ్ పెనుమల్లు వెంకట కుమారి, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు, గ్రామ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్, కొత్తపల్లి వ్యవసాయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మారిశెట్టి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- పెద్దాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం



గడప గడపకూ కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న దొరబాబు

పెద్దాపురం: కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు అన్నారు. పెద్దాపురం పట్టణంలోని 3, 28, 29 వార్డుల పరిధిలో మంగళవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు పెద్దపీట వేసి నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్, కనకాల మహాలక్ష్మి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, కౌన్సిలర్లు గడపా రామలక్ష్మి, సత్యభాస్కర్, విడదాసరి రాజా, ఆరెళ్ళి వీర్రాఘవులు, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, టీపీఓ ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కకాటు బాధితులకు చికిత్స



గతంలో కుక్కకాటుకు గురైన వారికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



శ్రావ్యకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి మౌనిక

- ఇటీవల వ్యక్తి మృతితో అమీనాబాదులో ఆందోళన

కొత్తపల్లి: మండలంలోని అమీనాబాదులో ఇటీవల కుక్క కాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తం అయ్యారు. మృతి చెందిన వ్యక్తిని కరిచిన కుక్క సుమారు 14 మందిని కరవడంతో వారికి మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారి మౌనిక ఆధ్వర్యంలో వైద్య పరీక్షలను నిర్వహించారు. కుక్క కరిచిన వారిలో అదే గ్రామానికి చెందిన కె.కొండమ్మ, బొందు అడివమ్మ, ఎస్.శ్రీను, కే.పవన్, పి.నాగమణి, ఎస్.అన్నపూర్ణ, పి.కొండమ్మ, పి.లక్ష్మి, ఎస్.సంగీతతో పాటు మరి కొంతమందికి వైద్య పరీక్షలు చేసి పర్యవేక్షణలో ఉంచారు.

కుక్కకాటుకు గురైన బాలిక

కుక్కకాటుకు గురై ఒక వ్యక్తి మృతి చెందడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్న సమయంలో మంగళవారం ఒక బాలిక కుక్కకాటుకు గురవడంతో ఆందోళనకు గురవుతున్నారు. అమీనాబాదుకు చెందిన బొందు శ్రావ్య స్థానిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. మంగళవారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్ద ఆడుకుంటుండగా కుక్కకాటుకు గురైంది. దీంతో బంధువులు చికిత్స నిమిత్తం ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చారు. వైద్యాధికారి మౌనిక వైద్యపరీక్షలు నిర్వహించి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: కుక్కకాటుకు గురైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మంగళవారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అమీనాబాదు గ్రామానికి చెందిన గంటా బానయ్య (56) ఏప్రిల్ 11న ఇంటినుంచి బయటకు వెళుతుండగా కుక్కకాటుకు గురయ్యాడు. స్థానిక పీహెచ్‌సీలో టీకాలు వేయించుకున్నాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌లో చేర్చారు. అయితే చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పవన్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

కొత్తపల్లి: పిచ్చి వ్యాఖ్యలు చేస్తే ఉపేక్షించబోమని, ఏలూరు బహిరంగ సభలో తమను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలంటూ మండలంలోని ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో మంగళవారం స్థానిక వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు అందించిన సేవలు, ఇంటింటికీ తిరిగి చేస్తున్న సేవలు కనిపించలేదా అని వారు ప్రశ్నించారు. క్షమాపణ చెప్పకపోతే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో ప్రతిపక్షనేత చంద్రబాబు, ఇప్పుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. నిందలు వేస్తే ప్రజలు సైతం ఉపేక్షించరని, ఈ విషయాన్ని పవన్ కల్యాణ్ గుర్తించుకోవాలని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో ఆయనకు వలంటీర్లు సత్తా చూపిస్తారని తెలిపారు.

పుట్టకొండయ్య కాలువపై షట్టర్లు అమర్చాలి



రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న రైతులు

పిఠాపురం: తమ గ్రామ పరిధిలో పుట్ట కొండయ్య కాలువపై నీటి పారుదల శాఖ అధికారులు తొలగించిన ఇనుప షట్టర్లు తిరిగి అమర్చాలని డిమాండ్ చేస్తూ గోకివాడకు చెందిన రైతులు మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కీర్తి హరనాథబాబు మాట్లాడుతూ నీటి పారుదలశాఖ అధికారుల తీరుకు నిరసనగా దీక్షలు చేపట్టామని తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. ఈనెల 15న వంటవార్పు, తరువాత నీటి పారుదల శఖ కార్యలయం ముట్టడి వంటి ఉద్యమ కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు నీటి పారుదల శాఖ అధికారుల తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

టీడీఆర్ బాండ్ల జారీకి పరిశీలన

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ మంగళవారం వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కార్పొరేషన్ తరఫున టీడీఆర్ బాండ్లకు సంబంధించి వివేకానందపార్కు, మసీదు సెంటర్ ప్రాంతాల్లోని స్థలాలను పరిశీలించి అధికారులతో చర్చించారు. టీడీఆర్ బాండ్లు జారీ చేసే అంశంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం 20వ డివిజన్ మహాలక్ష్మినగర్ ప్రాంతంలో జరిగిన సర్వేలో పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పిఠాపురం: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గొల్లప్రోలు మండలంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు శ్యామల, సుబ్బారావుల ఆధ్వర్యంలో గొల్లప్రోలు మండలంలో కొడవలి, తాటిపర్తి, వన్నెపూడి తదితర గ్రామాల్లో పర్యటించిన వైద్య సిబ్బంది ప్రపంచ జనాభా దినోత్సవంపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ అహ్మద్ బాషా, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోండి



గొల్లప్రోలు నగర పంచాయతీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి నిర్వహిస్తున్న జగనన్న సురక్ష మంచి ఫలితాలనిస్తోందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు తెలిపారు. మంగళవారం పిఠాపురం మండలం ఎఫ్‌కే పాలెం, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం మున్సిపాలిటీలలో నిర్వహించిన జగనన్న సురక్ష సమావేశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ కారణాలతో ఆగిపోయిన సర్టిఫికెట్లు ఈ కార్యక్రమం ద్వారా పైసా ఖర్చు లేకుండా ఒక్క రోజులో ఇస్తున్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఇప్పటి వరకు 13 వేలకు పైగా వివిధ సర్టిఫికెట్లు అందజేశామన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, ప్రత్యేకాధికారులు, నగర పంచాయతీ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలు తీర్చేందుకే జగనన్న సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రసంగిస్తున్న హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దొరబాబు

పెద్దాపురం: ప్రజావసరాలు గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష పథకానికి శ్రీకారం చుట్టిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం మండలంలోని జి.రాగంపేటలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దొరబాబు మాట్లాడుతూ పేద ప్రజలకు అందుబాటులో ఎటువంటి రుసుము లేకుండా జగనన్న సురక్ష ద్వారా సేవలందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ బందారు వీరబాబు, ఎంపీడీఓ అశోక్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి రమేష్, మాజీ జెడ్పీటీసీ బంగారు కృష్ణ, ఎంపీటీసీ కాలే అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: జగనన్న సురక్షతో ప్రతి గ్రామంలోని ప్రజలకు సచివాలయాలపై పూర్తి అవగాహన ఏర్పడటానికి అవకాశం ఉంటుందని మండల ప్రత్యేకాధికారి రాజ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలో జి.మేడపాడులో మంగళవారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అందే అన్ని సేవలు సచివాలయంలోనే అందుతున్నాయని ఆయన తెలిపారు. త్వరలో రిజిస్ట్రేషన్లు కూడా సచివాలయాల్లో నిర్వహించడం వల్ల దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ డి.శ్రీలలిత, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగనాయకులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, గ్రామ సర్పంచ్ పటాని దేవి, ఎంపీటీసీ సభ్యులు ముమ్మన వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు



దరఖాస్తుదారుకు సర్టిఫికెట్లు అందిస్తున్న అధికారులు

కొత్తపల్లి: జగనన్న సురక్ష ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని సర్పంచ్ కందేపల్లి సత్యశ్రీ అన్నారు. మండలంలోని కొమరగిరి సచివాలయం–1 వద్ద మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ప్రజలు కూడా ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ప్రత్యేకాధికారి పుష్పరాణి, ఎంపీడీఓ అబ్రహం లింకన్, ఈఓ పీఆర్డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి వారిజ, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం



సామర్లకోట పోలీసు రింగ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించిన వలంటీర్లు

పెద్దాపురం: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ హద్దు దాటి మాట్లాడితే సహించేది లేదని పెద్దాపురం పట్టణ వలంటీర్లు మండిపడ్డారు. వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు చేస్తూ పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం పట్టణ వలంటీర్లు స్థానిక మున్సిపల్ సెంటర్‌లో భారీ మానవహారం నిర్వహించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు కొల్లి రమణమ్మ, సారా భవానీ, వారాది దుర్గాదేవి, కలిదిండి కుమారి తదితరులు మాట్లాడుతూ గౌరవ వేతనం తీసుకుంటూ మానవతాయుతంగా సేవలందిస్తున్న వలంటీర్లపై చిల్లర రాజకీయాల కోసం తప్పుడు కూతలు కూస్తే సహించేది లేదన్నారు. పవన్ బేషరతుగా వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సామర్లకోట: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు ఎక్కడికక్కడే నిరసనలు తెలియజేశారు. మంగళవారం పట్టణ పరిధిలోని వలంటీర్లు స్థానిక పోలీసు రింగ్ స్టేషన్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. పవన్‌కల్యాణ్ వెంటనే వలంటీర్లకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఉండూరు గ్రామంలో వలంటీర్లు సచివాలయం వద్ద నిరసన తెలియజేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చౌదరి



తాగునీటి ప్లాంటులో నీటిని పరిశీలిస్తున్న ఈఈ చౌదరి

కొత్తపల్లి: కాలువల ద్వారా పూర్తిస్థాయిలో నీరు రాకపోవడం వల్ల తాగునీటి ఎద్దడి ఏర్పడుతోందని, దీని నివారణకు చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ చౌదరి అన్నారు. సాక్షి దినపత్రికలో సోమవారం తాగునీరు కలుషితం అనే శీర్షిత ప్రచురించిన విషయం పాఠకులకు విదితమే. దీనిపై అధికారులు స్పందించారు. మండలంలోని వాకతిప్ప శివారున ఉన్న నాగులాపల్లి పరిసర గ్రామాల రక్షిత నీటి పథకాన్ని మంగళవారం పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, ఫిల్టర్ బెడ్, క్లియర్ వాటర్ సంపులను పరిశీలించారు. వాటర్ ట్రీట్‌మెంటును అదనంగా చేయాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువల ద్వారా నీరు రాకపోవడం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నీటి పరిమాణం తక్కువవడం వల్ల నీటి రంగు మారుతోందన్నారు. ఆయన వెంట డీఈ శ్రీదేవి, జేఈ సంధ్య ఉన్నారు.

కోడి పందేలపై పోలీసులు దాడి

ఐదుగురి అరెస్టు

కొత్తపల్లి: కోడి పందేలపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నాగులాపల్లి శివారు పంట పొలాల సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో ఎస్సై రామలింగేశ్వరరావు తన సిబ్బందితో దాడి చేశారు. జూదగాళ్లను అరెస్టు చేసి రెండు కోళ్లు, రూ.350 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య మంగళవారం పరిశీలించారు. స్థానిక సత్యనారాయణపురంలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తయారుచేసిన భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజూ విద్యార్థులకు వడ్డించే భోజనం రుచిగా ఉండేలా చూడాలని ఆయన సూచించారు.